# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-04-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" కార్యక్రమం 133వ సంచిక ఈరోజు ఉదయం 11 గంటలకు ప్రసారం అవుతుంది.**

2. **ఆంధ్రప్రదేశ్ కు పెట్టుబడులను ఆకర్షించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

3. **కేంద్రమంత్రి ఎల్.మురుగన్ ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ఈరోజు దర్శించుకుంటారు.**

4. **ఉత్తరాంధ్రలో సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలకు గోదావరి జలాలను వినియోగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.**

5. **జనగణన-2027లో భాగంగా తెలంగాణలో ఈరోజు నుంచి స్వీయ గణన కార్యక్రమం ప్రారంభమవుతుంది.**

========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 133వ సంచిక ఈరోజు ఉదయం 11 గంటలకు ప్రసారం అవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

-------------------------

ఆంధ్రప్రదేశ్ కు పెట్టుబడులను ఆకర్షించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ముంబైలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా "ఎకనమిక్ టైమ్స్ బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ - 2025" అవార్డును ముఖ్యమంత్రి నిన్న స్వీకరించారు. అనంతరం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. వేగవంతమైన వాణిజ్యం, స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానాల ద్వారా సుపరిపాలన అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ గౌరవం అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ అవార్డు ద్వారా మరిన్ని పెట్టుబడులు ఆంధ్రప్రదేశ్‌కు వస్తాయని ముఖ్యమంత్రి పేర్కొంటూ....

వాయిస్..30.. సెకన్లు

-------------------------

కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ సహాయమంత్రి ఎల్.మురుగన్ ఆంధ్రప్రదేశ్ లో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా నిన్న తిరుపతి చేరుకున్న ఆయన తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న కేంద్రమంత్రికి టిటిడి అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం కేంద్రమంత్రి మురుగన్ తిరుమలకు బయలుదేరి వెళ్లారు. ఈరోజు ఉదయం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని కేంద్రమంత్రి దర్శించుకుంటారు.

-------------------------

ఉత్తరాంధ్రలో సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలకు గోదావరి జలాలను వినియోగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. కాకినాడ జిల్లా అన్నవరంలో పంపా ఆక్విడక్ట్ వద్ద పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులను మంత్రి నిన్న పరిశీలించి కాలువ పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... ఇప్పటివరకూ ఎడమ కాలువ పనులు 76 శాతం పూర్తి చేశామన్నారు. జూన్ నాటికి అనకాపల్లి వరకు గోదావరి జలాలు తీసుకెళ్లేలా పనులు పూర్తి చేయనున్నామని మంత్రి పేర్కొంటూ

వాయిస్..30..సెకన్లు

-------------------------

భూములు ఇచ్చిన రైతులకు మే ఒకటి నుండి కౌలు నిధులు జమ చేయనున్నామని ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. అమరావతిలో భూ సేకరణ జరుగుతున్న తీరుపై సంబంధిత అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. అంతర్జాతీయ క్రీడా నగరం, ఇన్నర్ రింగ్ రోడ్, రైల్వే లైన్, రైల్వే స్టేషన్ నిర్మాణాల కోసం ఏడు గ్రామాల్లో భూముల సేకరణ కొనసాగుతోందని తెలిపారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, వ్యర్థాలు నిర్వహణపై మంత్రి సమీక్షించారు. వేస్ట్ ప్లాంట్ల ఏర్పాటును వేగవంతం చేసి వ్యర్థాల నిర్వహణను ప్రారంభించాలని సూచించారు.

-------------------------

జనగణన-2027లో భాగంగా తెలంగాణలో ఈరోజు నుంచి స్వీయ గణన కార్యక్రమం ప్రారంభం కానుందని జనగణన తెలంగాణ డైరెక్టర్ భారతీ హోళికెరి తెలిపారు. హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆమె నిన్న పాత్రికేయులతో మాట్లాడారు. సెల్ఫ్-ఎన్యుమరేషన్ ప్రక్రియ ఈరోజు నుంచి మే 10వ తేదీ వరకు కొనసాగుతుందని వివరించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత జరుగుతున్న మొదటి జనగణన ఇది అని పేర్కొన్నారు. ప్రజలు se.census.gov.in వెబ్ పోర్టల్ ద్వారా స్వచ్ఛందంగా జనగణనకు తమ వివరాలను అందించవచ్చని తెలియజేస్తూ..

వాయిస్..25.. సెకన్లు

-------------------------

ఆంధ్రప్రదేశ్  హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ నిన్న ప్రమాణస్వీకారం చేశారు. విజయవాడలోని లోక్‌భవన్‌లో గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్.. ఆమెతో ప్రమాణం చేయించారు. రాష్ట్ర హైకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ నిలిచారు. జస్టిస్ లీసా గిల్ స్వస్థలం చండీగఢ్. 1990లో న్యాయవాదిగా పంజాబ్-హరియాణా హైకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. సుదీర్ఘకాలం చండీగఢ్‌కు, పలు ప్రభుత్వరంగ బోర్డులకు, కార్పొరేషన్లకు ప్రాతినిధ్యం వహించారు. 2014 మార్చి 31న పంజాబ్-హరియాణా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ లో మాదకద్రవ్యాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా వెల్లడించారు. గుంటూరు జిల్లా రత్నాల చెరువులో కొత్తగా ఏర్పాటు చేసిన ఈగల్ ప్రధాన కార్యాలయాన్ని డీజీపీ నిన్న లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈగల్ సంస్థ ఏడాదిన్నర కాలంలో గంజాయి, మత్తు పదార్థాలను నిరోధించడంలో అద్భుతమైన పనితీరు కనబరిచిందని ప్రశంసించారు. రాష్ట్రవ్యాప్తంగా గంజాయి, డ్రగ్స్ కేసుల్లో నిందితుల విచారణకు రాష్ట్రంలో 13 ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయనున్నట్లు తెలుపుతూ...

వాయిస్..30..  సెకన్లు

-------------------------

తెలంగాణ రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా పప్పులు, నూనెగింజలు, కూరగాయలు, చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో వర్షాకాలం పంటల సాగు ప్రణాళికలపై సంబంధిత అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో  వచ్చే వర్షాకాలంలో రాష్ట్రంలో తక్కువ వర్షపాతం నమోదవుతుందని వాతావరణ శాఖ వెల్లడించిందని, ఇందుకు అనుగుణంగా రైతులు ఏ ఏ పంటలు వేయాలో తెలిపే విధంగా సమగ్ర ప్రణాళికను సిద్ధం చేయాలని  అధికారులను ఆదేశించారు. అనుకూలమైన సాగు పరిస్థితులు ఉన్నప్పటికీ పప్పులు, చిరుధాన్యాల సాగు తగ్గుతోందని అవి రాష్ట్రంలోనే లభ్యమయ్యేలా పంటలను పెంచే విధంగా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ లో పెట్రోల్, డీజిల్ కొరతపై వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి సూచించారు. తూర్పుగోదావరి జిల్లాలో ఇంధన కృత్రిమ కొరతపై బెంగుళూరు నుండి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరితో ఆమె నిన్న ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా కొన్ని ఏజెన్సీలు, సరఫరా దారులు కృత్రిమ కొరత సృష్టిస్తూ ప్రజల్లో అనవసర భయాందోళనలు కలిగిస్తున్నారని  ఆందోళన వ్యక్తం చేశారు.

====================